## క్లుప్తంగా

### మకర పీఠానికి వెండి సమర్పణ



వెండి అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోట శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం భీమవరానికి చెందిన మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులు 250 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

భీమవరం: విద్యార్థులు వేసవి సెలవుల్లో శాఖాగ్రంథాలయాల్లో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎం శేఖర్‌బాబు సూచించారు. శనివారం స్థానిక డాక్టర్ వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రీడాల్లో శిక్షణ ఇస్తున్నామని, ప్రతి ఏటా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాయలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, తెలుగు రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

### మద్యపానంతో కుటుంబాలు అస్తవ్యస్తం



మద్యపానం వల్ల కలిగే అనర్థాల ప్రచారం కార్యక్రమం దృశ్యం

భీమవరం: మద్యపానం కారణంగా కుటుంబాలు అస్తవ్యస్తం కావడమేగాక అనారోగ్యంతో జీవితం దుర్భరమవుతుందని భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు అన్నారు. శనివారం శ్రీవిజ్ఞాన వేదిక, భీమవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ముఠా కూలీలతో మద్యపాన వ్యసనం – జీవితం నాశనం అనే నినాదంతో నిర్వహించిన అవగాహన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మద్యపాన వ్యసనం వల్ల కలిగే ఇబ్బందులు, నష్టాలను వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, తటవర్తి భాస్కరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### రీసర్వేపై గ్రామ సభ



పాందువ్వలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పాందువ్వ గ్రామంలో రీసర్వే గ్రామ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ రీసర్వే ద్వారా భూసంబంధ సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవచ్చని అన్నారు. రీసర్వే సమయంలో రైతులు తమ డాక్యుమెంట్లను దగ్గరుంచుకుని, భూమి కొలతలు సరిపోలుతున్నాయో లేదో చూసుకోవాలని అన్నారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

### ఏఎస్ఎన్ఎం కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల

యలమంచిలి: పాలకొల్లు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల రెండో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ చివరి, మే మొదటి వారంలో రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. రెండో సెమిస్టర్‌లో మొత్తం 213 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 71 శాతంతో 151 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆమె అభినందించారు. విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ టి.కృష్ణ, పరీక్షల కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు

- అసౌకర్యాలతో చిన్నారులకు అవస్థలు
- ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేక అద్దె ఇళ్లలోని ఇరుకు గదుల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నియోజకవర్గంలోని మొత్తం 261 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16 మినీ కేంద్రాలు ఉన్నాయి. 87 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా 101 అద్దె భవనాల్లో, మిగిలిన కేంద్రాలు పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహిస్తోన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు రేకుల షెడ్డు, పాడైన పెంకుటిల్లు, శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో గాలి, వెలుతురు సరిగా లేక ఉక్కబోతలో చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 10 మందితో నడిచే కేంద్రాలకు నెలకు రూ.3 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఐసీడీఎస్ రూ.2 వేలు వెచ్చిస్తోంది. మిగిలిన మొత్తాన్ని కార్యకర్తలు భరించాల్సి వస్తోంది.



మోగల్లులో పాడైన పెంకుటింటిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



మోగల్లు అరుంధతి కాలనీలో శిథిలావస్థకు చేరిన కేంద్ర వెనుక భాగం

**పూర్తికాని నిర్మాణాలు**

వైఎస్సార్ సీపీ హయాంలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు, కాళ్ల మండలం బొండాడ పేట, ఉండి మండలం మహాదేవపట్నం, ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు రూ.12 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు వచ్చాయి. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వ పాలన ఏడాదికావస్తున్నా అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు పూర్తికాలేదు. అధికారులు స్పందించి నిర్మాణ పనులన పూర్తి చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**భవనాలను ప్రారంభిస్తాం**

బొండాడ పేట, మహదేవపట్నం, కుప్పనపూడి తదితర గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. విస్సాకోడేరులో నిర్మాణం పూర్తికాల్సి ఉంది. పూర్తయిన భవనాలను 15 రోజుల్లో ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తాం. అద్దె భవనాల్లో కొనసాగే కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే వేరే భవనాల్లోకి మార్చే చర్యలు తీసుకుంటున్నాం. – వాణి విజయరత్నం, సీడీపీఓ, ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్

### అక్రమ అరెస్టులు తప్ప ప్రజలకు చేసింది శూన్యం



ఈద జాషువ

భీమవరం: కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు తప్ప రాష్ట్ర ప్రయోజనం కోసం చేసిందేమీ లేదని వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువా ధ్వజమెత్తారు. శనివారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల వంటి అత్యున్నత స్థాయి పాలనాధికారులపై సీఎం చంద్రబాబు రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగడాన్ని తప్పుపట్టారు. మాజీ ఐఏఎస్, మాజీ ఉన్నతాధికారులపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేలా ప్రజల దృష్టిని మళ్లించేందుకు అరెస్టుల పర్వం చేపట్టిందన్నారు. ప్రభుత్వానికి నిస్వార్థంగా సేవలందించిన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి వంటి మాజీ సీనియర్ అధికారుల అరెస్టులు విషయం ఎంతో బాధాకరమని అన్నారు. ఈ అరెస్టులను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని హితవుపలికారు.

# సమీకృత వ్యవసాయ విధానమే మేలు

వీరవాసరం: సుస్థిర ఆదాయానికి సమీకృత వ్యవసాయ విధానమే మేలని వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్ మల్లికార్జునరావు అన్నారు. ఉండి కేవీకే, రాజమహేంద్రవరం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం తమకున్న వనరులు, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌ను బట్టి వ్యవసాయం చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలను పాటించడం ద్వారా అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం కూడా పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యర్థాల పునర్వినియోగం ద్వారా రసాయనకు ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందడంతో పాటు భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విద్యార్థులు తయారుచేసిన వ్యవసాయ ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేవీకే ఏడీఆర్ భువనేశ్వరి, గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి భాస్కర రావు, ప్రొఫెసర్ ఆఫ్ ప్లాంట్ పాథాలజీ కె.విజయ్ కృష్ణ కుమార్, ఎస్ఎంఎస్ హార్టికల్చర్ ఆర్ బిందు ప్రవీణ చౌదరి, కేవీకే కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ డిబోరా మెస్సానియా, విద్యార్థులు మహాలక్ష్మి, సౌభాగ్య, నికిత, సింధు, శశాంక్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ప్రదర్శనలను తిలకిస్తున్న మల్లికార్జునరావు తదితరులు

# మహోన్నత వ్యక్తి సుందరయ్య

ఉండి: కార్మికుల సంక్షేమం కోసం తన సంపదను, జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. శనివారం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రం వద్ద ఉపాధి హామీ కూలీల మధ్య పుచ్చలపల్లి 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముని వెంట నడిచిన సుందరయ్య సోషలిజంతోనే దేశ పురోగతి అని భావించారని , అందుకే కమ్యునిస్టు పార్టీని బలోపేతం చేశారని వివరించారు. ఉపాధి హామీ పథకంలో నెలకు 20 పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.



అగ్రహారంలో పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో నాయకులు బురిడి వాసుదేవరావు, మునుకోలు వైకుంఠరావు, ధనికొండ శ్రీనివాస్, చిట్టి అన్నవరం, కూలీలు పాల్గొన్నారు.

### స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ప్రతిజ్ఞ

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి గీతాబాయి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందరభంగా గీతాబాయి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోపాటు ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించాలన్నారు.

**పాలకోడేరు మండలంలో..**

పాలకోడేరు: స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, గొరగనమూడి గ్రామ వైద్య సిబ్బంది, సచివాల సిబ్బంది ఆధ్వర్యంలోను శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్‌వీ రంగమ నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గొరగనమూడిలో వీఆర్వో సరళ, హెల్త్ అసిస్టెంట్ విజయ్ ప్రసాద్, ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాలనలో చంద్రబాబు విఫలం

యలమంచిలి: రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగిపోయిందని కాగ్ రిపోర్టు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత డిమాండ్ చేశారు. పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి అధికారంలోనికి వచ్చిన ఏడాది తర్వాత కూడా వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె విమర్శించారు. సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది పాలనలో ఎంత సంపద సృష్టించారో ప్రజలకు వివరించాలని ఆమె డిమాండ్‌చేశారు. సంపద సృష్టించడం మాట అటుంచి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాగ్ నివేదికలో బయటపడడం ప్రభుత్వ పనితీరును అద్దం పడుతుందని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్ పార్టీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత

### ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించాలి

పెనుమంట్ర: మండలంలో పెనుమంట్ర, పాలమూరు గ్రామంలో ఉపాధి హామీ చట్టం కూలీలకు తక్షణమే చట్ట ప్రకారం వంద రోజులు పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలో పెనుమంట్ర, పాలమూరు గ్రామాల్లో పని ప్రదేశంలో పని చేస్తున్న కూలీలను కలుసుకోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో పెనుమంట్ర గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించే యుక్త ధార యాప్ ఎంపిక అవ్వడం వల్ల ఉపాధి హామీ పనులు అనుమతులు ఇప్పటివరకు రాకపోవడం వల్ల కూలీలకు పని లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా డెల్టా ప్రాంతం రెండు పంటలు వ్యవసాయానికి అనువైనది కాబట్టి మే నెలలో పనులు కల్పించకపోతే మరో సంవత్సరం మే నెలలో 2026 వరకు ఆగాల్సి ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

### ప్రజలకు అందుబాటులో తపాలా బ్యాంకింగ్

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు తపాలా సేవలతో పాటు బ్యాంకింగ్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు భీమవరం డివిజన్ తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరి కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం పెనుమంటలో దాట్ల భవనంలో నిర్వహించయిన తణుకు సబ్ డివిజన్ తపాలా ఉద్యోగుల అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తపాలాశాఖ ద్వారా పొదుపు పథకాలతో పాటు పూర్వపు మనీ ఆర్డర్, ఉత్తరాలు రిజిస్ట్రేషన్ వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ కూలీల కోసం ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా వారి కుటుంబాల్లో ఆపదకాలంలో ఆదుకునేందుకు అనేక రకాల బీమా సదుపాయాలను కూడా ప్రధాన మంత్రి ప్రవేశపెట్టారని, గ్రామీణ ప్రజల ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తపాలా ఉద్యోగులు అంతా పోస్టాఫీస్ ద్వారా అమలు జరుగుతున్న పథకాలను ప్రజలకు తెలియజెప్పి తపాలా బ్యాంకింగ్ సదుపాయాలలో వారిని భాగస్వాములు చేయాలని కోరారు. ఈసందర్భంగా తణుకు సబ్‌డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన పలువరు తపాలా ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.సూర్యప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భీమవరం ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమవరం డివిజన్ తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ హరి కృష్ణ ప్రసాద్

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

యలమంచిలి: తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని కోరుతూ శనివారం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కలసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోను నాణ్యమైన విద్య, వసతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఇలా అనేక వసతులు ఉచితంగా లభిస్తున్నాయన్నారు. అన్నింటికీ మించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తారన్నారు. కాబట్టి తల్లిదండ్రులు మంచిగా ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. కుడకా ప్రసాద్, సానబోయిన శ్రీనివాస్, వాస్కూరి పరమేశ్వరరావు, నేదునూరి నరసింహారావు, హెచ్ఎం కేబీటీ సుందరి , సిబ్బంది వాస్కూరి వరలక్ష్మి పాల్గొన్నారు.



కుమ్మరపాలెంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

**ఆచంటలో..**

పెనుగొండ: బడిఈడు ప్రత్యేక దివ్యాంగులు ఎవరూ బడి బయట ఉండకూడదని, ఎవరైనా ఉంటే వారిని దగ్గరలో ఉన్న పాఠశాల్లో చేర్పించాలని ఆచంట ఎంఈవోలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం ఆచంట మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఐఈఆర్‌పీలు, ఎస్ఎంపీ గణేష్, ఎంఆర్‌పీ సాఫ్ సీఆర్‌పీలు పాల్గొన్నారు.

### సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలు పెంచాలి

పెనుగొండ: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాంఘిక , సాధికారిత అధికారి బీవీవీఎస్ రామాంజనేయరాజు అన్నారు. శనివారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో పెనుగొండ, ఆచంట, ఇరగవరం, పెనుమంట్ర మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పింస్తుందన్నారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. గ్రామాల వారీగా వసతి గృహ అవసరం ఉన్న విద్యార్థుల వివరాలు సేకరించాలన్నారు. డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారిని వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో తణుకు సహాయ సాంఘిక సంక్షేమాధికారి పి.నాగ సాయమ్మ, మండల సమన్వయ అధికారులు జి.ఫణికుమార్, కేవీ నర్సమ్మ, వై.అరుణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శనివారం ప్రత్యేంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

### అభివృద్ధిలో డిజిటల్ టెక్నాలజీ పాత్ర కీలకం

భీమవరం (ప్రకాశంచౌక్): దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని టెలిఫోన్ జేటీవో పులి సాయి బాబా అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎడ్వార్ట్ ట్యాంక్ వద్ద బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ కార్యాలయంలో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పురాతన ఆధునిక టెలిఫోన్ చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, మారుమూల ప్రాంతాలకు వైద్య సదుపాయాలు తదితర సమస్యలను అందించడంలో సమాచార సాంకేతిక వ్యవస్థ కీలంకంగా వ్యవహరిస్తుందని సాయిబాబా తెలిపారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రపంచంలో టెలి కమ్యూనికేషన్ నెట్ వర్క్ ఉన్న దేశాల్లో భారత్ రెండో అతి పెద్ద దేశంగా అవతరించిందన్నారు. కొండ్రు శ్రీనివాస్, సిద్దబోయిన రామచార్యులు, కళింగ అప్పారావు, కాటుక బ్రహ్మయ్య పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఆవు దూడ మృతి



మృతి చెందిన ఆవు దూడ

ఆకివీడు : స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని పెట్రోల్ బంకు సమీపంలో తెల్లవారు జామున గుర్తుతెలియని వాహనం ఢీకొని బండారు సూర్యనారయాణకు చెందిన ఆవు దూడ మృతి చెందింది. ఆ సమయంలో దూడను చూసిన ఆవు అరుపులతో తల్లడిల్లిపోయింది. జేసీబీతో దూడను అక్కడ నుంచి తరలించారు. ఆవులిఫ్ఫ, ఆవుదూడల్ని సాయింత్రం పూట, ఉదయం పూట పాలు తీసుకున్న తరువాత రోడ్లపైకి వదిలివేస్తున్నారు. రోడ్ల వెంబడి పచ్చగడ్డి, ఇతర వ్యర్థాల్ని తిని రోడ్డు పక్కనే పడుకుంటున్నాయి. దూడలు అటూఇటూ తిరుగుతూ ప్రమాదానికి గురవుతున్నాయి. గతంలో ఆవుల్ని బయటకు వదల వద్దని నగర పంచాయతీ అధికారులు హెచ్చరించినా పట్టించుకునే నాథుడులేడు.

### బైక్‌ల వేలం ఆదాయం రూ.80 వేలు

ఆకివీడు : స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద మద్యం అక్రమ అమ్మకాల్లో దొరికిన నాలుగు మోటారు సైకిళ్ల శనివారం వేలం పాట వేశారు. రూ.80 వేలకు వాటిని పాటదారలు కైవశం చేసుకున్నారు. వేలంపాటలో సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ కరుణప్రియ పాల్గొన్నారు.

### వ్యక్తిపై ముగ్గురి దాడి

ఉండి: వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం మహదేవపట్నం బొక్కావారి పాలెం ప్రాంతానికి చెందిన జుత్తిగ దుర్గాప్రసాద్, అదే ప్రాంతనికి చెందిన కవురు దుర్గామల్లేశ్వరరావుకు స్థానికంగా దుర్గమ్మగుడి నిర్మాణ సమయంలో గొడవలు తలెత్తాయి. వీటిని స్థానిక పెద్దల సమక్షంలో పరిష్కరించుకున్నారు. నాటి నుంచి దుర్గామల్లేశ్వరరావు దుర్గాప్రసాద్‌ను వంకలు పెట్టి తిడుతూనే ఉన్నాడు. దీనిపై గత నెల 25న మళ్లీ పెద్దల సమక్షంలో పరిష్కారానికి సిద్ధమయ్యారు. ఆ సమావేశంలో దుర్గామల్లేశ్వరరావు తనతో ఉండే మరో ఇద్దరు వ్యక్తులు తనను కొట్టి చంపుతామని బెదిరించినట్లు దుర్గాప్రసాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.